పోలింగ్‌కు సర్వం సిద్ధం

- సున్నిత ప్రాంతాల్లో వెబ్‌కాస్టింగ్
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట భద్రత

అంబర్‌పేట : ఏర్పాట్లు పరిశీలిస్తున్న సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ పాటిల్ కేశవ్

అబిడ్స్, మే 12 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం ఆరు గంటలకు ముగియనుంది. గోషామహల్ నియోజకవర్గంలోని 109 ప్రాంతాల్లోని 235 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వాహణ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎస్.విద్యాధర్, వి.విక్టర్ నేతృత్వంలో కేంద్రాల ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఎన్నికల సామగ్రిని కోఠి మహిళా విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి అందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్‌ల ద్వారా ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఇద్దరు సిబ్బంది చొప్పున నలుగురు తరలి వెళ్లారు. గోషామహల్ సెగ్మెంట్‌లో మూడు వేల వరకు మంది సిబ్బంది విధులలో పాల్గొననున్నారు. నియోజక వర్గం 11 పోలీస్ స్టేషన్ల పరిధిలోకి వస్తుండడంతో ఆయా కేంద్రాలపై మైక్రో అబ్జర్వర్‌లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించ నున్నారు.

ఎన్నికలకు ప్రత్యేక బలగాలు ..

గోషామహల్ సెగ్మెంట్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గాను పోలీస్ అధికారులు ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపారు. నియోజకవర్గం పోలీస్ నోడల్ అధికారిగా గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పీఎస్ వద్ద పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పారా మిలిటరీ బలగాలు, కేంద్ర బలగాలతో పాటు వందలాది మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ.. ఓటు హక్కును వినియోగించుకోవాలి

గోషామహల్ సెగ్మెంట్‌లో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎస్. విద్యాధర్, వి. విక్టర్ తెలిపారు. ఓటర్ల స్లిప్‌లను తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారని, ఉదయం ఐదున్నర గంటలకు ఈవీఎంలలో మాక్ పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సాయంత్రం పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను కోఠిలోని మహిళా విశ్వ విద్యాలయం వద్ద స్ట్రాంగ్ రూంలో భద్ర పర్చడం జరుగుతుందని పేర్కొన్నారు.

అంబర్‌పేట పరిధిలో..

అంబర్‌పేట : సోమవారం జరుగనున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పోలింగ్‌కు అంబర్‌పేట నియోజకవర్గంలో అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదివారం ఓటింగ్ యంత్రాలు చేరవేశారు. అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించి బర్కత్‌పురలోని రెడ్డి ఉమెన్స్ కళాశాలను కేంద్రంగా ఏర్పాట్లు చేసి ఈవీఎంలను ఇక్కడే భద్రపరిచిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం ఈవీఎంలను ఇక్కడే స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారు. పోలింగ్ ఏర్పాట్లపై నియోజకవర్గం సహాయ ఎన్నికల అధికారి (ఏఆర్వో) అపర్ణ వివరాలను వెల్లడించారు.

ఉదయాన్నే మాక్ పోలింగ్ ...

సోమవారం ఉదయం 6 నుంచి 6 : 30 గంటల వరకు పోలింగ్ కేంద్రంలో మాక్ పోలింగ్ జరుగుతున్నది. ప్రిసైడింగ్ ఆఫీసర్లు వీటిని నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏజెంట్ల సమక్షంలోనే ప్రక్రియ సాగుతుంది. దాంతో ఓటింగ్ యంత్రాల పనితీరు స్పష్టం అవుతుంది.

236 పోలింగ్ బూత్‌లు ..

నియోజకవర్గం పరిధిలో 236 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు ఏఆర్వో తెలిపారు. బూత్‌కు ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి,ముగ్గురు సహాయక సిబ్బంది ఉంటారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి మైక్రో అబ్జర్వర్, వెబ్‌కాస్టింట్ అధికారి, బూత్ లెవెల్ అధికారి ఉంటారని చెప్పారు. 21 రూట్లలో 21 మంది రూట్ ఆఫీసర్లు, 21 మంది సెక్టార్ అధికారులు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ఈవీఎంలు ఏవైనా సతాయిస్తే బాగు చేయడానికి, ప్రారంభానికి మొరాయిస్తే మరమ్మతు చేయడానికి ఈసీఐఎల్ నుంచి స్పెషల్ టీమ్స్ అందుబాటులో ఉంచామన్నారు. 20 శాతం అదనపు ఈవీఎంలు అందుబాటులో ఉంచామని తెలిపారు.

తరలింపు సజావుగా ...

ఈవీఎం, వీవీ ప్యాట్‌లతో పాటు కేంద్రాలకు సిబ్బంది తరలింపు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్నామని ఏఆర్వో తెలిపారు. ప్రతి బస్సులకు పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు ఉంటుందన్నారు.

దివ్యాంగుల కోసం...

పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేశామని వీల్‌చైర్లు ఉంచామన్నారు. వీరిని ఇంటి నుంచి తీసుకువచ్చి మళ్లీ ఇంటి దగ్గర దించేందుకు ఆటోలు, వాహనాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ర్యాంపులు పెట్టడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా వలంటీర్లను ఏర్పాటు చేశామని ఏఆర్వో తెలిపారు.

నియోజకవర్గంలో 2,79,924 మంది ఓటర్లు...

అంబర్‌పేట నియోజకవర్గంలో మొత్తం 2,79,924 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఏఆర్వో అపర్ణ తెలిపారు. ఇందులో 1,41,080 మంది పురుషులు, 1,38,832 మంది మహిళలు, 12 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారని చెప్పారు.

ముషీరాబాద్‌లో పరిధిలో 274 కేంద్రాలు..

కవాడిగూడ : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేట్లు ఏర్పాట్లు చేసినట్లు ముషీరాబాద్ నియోజక వర్గం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. నియోజక వర్గంలో 274 కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని ఆదివారం కవాడిగూడ డివిజన్ గగన్‌మహల్ ఏవీ కళాశాల నుంచి ఆయా కేంద్రాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏవీ కళాశాలలో ఏఆర్వో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముషీరాబాద్ నియోజక వర్గంలో 3 లక్షల 7 వేల 556 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. 274 పోలింగ్ కేంద్రాలను 25 సెక్టార్లుగా విభజించి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. 66 లొకేషన్లలో 147 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, సీసీ కెమెరాలతో పాటు మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ 1465 గాను 1100 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. 44 బస్సుల ద్వారా ఈవీఎంలు తరలించినట్లు, చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, డీఐ వరప్రసాద్, ఎస్సై శ్రీనివాస్ రెడ్డి పోలీసు బలగాలతో ఏవీ కళాశాల వద్ద బందోబస్తును నిర్వహించి కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వెల్లడించారు.

గోషామహల్ డీఆర్సీ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్ల ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం కోఠి మహిళా కళాశాలలోని గోషామహల్ – 65 డీఆర్సీ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఏఆర్వోలు విక్టర్, విద్యాధర్‌లతో ఈవీఎంల పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తామని, పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించేది లేదని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఓటర్లు సహకరించాలని కోరారు.

– సుల్తాన్‌బజార్,మే 12

అబిడ్స్ : మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు విద్యాధర్, విక్టర్

కవాడిగూడ : ఏవీ కళాశాలలో ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లడానికి హాజరైన అధికారులు

ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు

ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మే 12 : అర్హులందరూ విధిగా రా జ్యాగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, రంజన్ నాయుడు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగంచేసుకోవాలి

అంబర్‌పేట, మే 12 : ఓటు హక్కును అర్హులందరూ వినియోగించుకోవాలని అంబర్‌పే ట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. అందరు తమ ఓటుహక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని అన్నా రు. దివ్యాంగులు, ముసలి వాళ్లకు బస్తీలు, కాలనీల్లోని విద్యావంతులు, యువత సహకరించి కేంద్రం వద్దకు వచ్చేలా చూడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామంలో ఓటు కీలకమని పేర్కొన్నారు.



ఓటు వేయండి.. ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ పొందండి

కాచిగూడ, మే 12 : అర్హులందరూ ఓటు హక్కు వినియోగించేలోవాలని నేషనల్ కంప్యూటింగ్ కౌన్సిల్ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత ఓటు వేసి.. సిరా ను చూపించి కంప్యూటర్ కోర్సు ఆన్‌లైన్‌లో శిక్షణ పొందండి అని పిలుపునిచ్చారు. సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ కోర్సు, ఎథికల్ హాకింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అకౌంటెన్సీ, కంప్యూటర్ టైపింగ్, టాలీ, డెటా ఎం ట్రీ, టాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పే ర్కొన్నారు. వివరాలకు 950580 0047లో సంప్రదించవచ్చు.

చిక్కడపల్లి పరిధిలో భారీ బందోబస్తు

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ ఎల్.రమేష్

చిక్కడపల్లి, మే12 : పార్లమెంట్ ఎన్నికల దృష్టిలో ఉంచుకుని చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ రమేశ్ బాబు వివరించారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఎన్నికల సందర్భంగా పోలీసులకు, సిబ్బంది క సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఉల్లగించేవారిపై ర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. చిక్కడపల్లి సీఐ ఎరుకొండ సీతయ్య, అడ్మిన్ ఎస్సై నాగరాజు, ఎస్సైలు శశిపాల్‌రెడ్డి, మౌనిక పాల్గొన్నారు.

అంబర్‌పేటలో అదనపు బలగాలతో..

రఘు, కాచిగూడ ఏసీపీ

అంబర్‌పేట, మే 12 : పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర సా యుధ బలగాలతో బం దోబస్తు చర్యలు తీసుకున్నామని కాచిగూడ ఏసీపీ రఘు అన్నారు. సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ నేతృత్వంలో డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామ ని పేర్కొన్నారు. సమస్యాత్మక, సాధారణ సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి,ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశామని వివరించారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యం పటిష్టం..

ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్

కాచిగూడ, మే 12 : ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉండాలంటే, అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. నేడు జరుగనున్న పార్లమెంటరీ ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాల నుంచి సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, హోంగార్డులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీఎస్ పరిధిలో 42 వేల మంది ఓటర్లు ఉన్నట్లు, మొత్తం 62 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలలో..

మెహిదీపట్నం, మే 12 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాంపల్లి సెగ్మెంట్‌లో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాంపల్లి సెగ్మెంట్‌లో పోలింగ్ కేంద్రాల ఈవీఎం లు, వీవీ ప్యాట్‌లు, ఎన్నికల సామగ్రిని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు అందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా రూట్ ఆఫీసర్లు వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మొత్తం మీద ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గాను అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

కార్వాన్ నియోజకవర్గంలో..

కార్వాన్ నియోజకవర్గం పరిధిలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గాను అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్‌ను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి ఆయా పోలింగ్ కేంద్రాలకు చెందిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను తరలించారు. ఉదయం ఐదున్నర గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎన్నికలు నిర్వహించను న్నారు. ఎన్నికలు పూర్తైన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో భద్ర పరచనున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమానికి కృషి చేసిన మహా నాయకుడు నాయిని

గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయిని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

బాగ్‌లింగంపల్లిలోని లంబాడితండా బస్తీలో నాయిని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, మే 12 : పేదల సంక్షేమానికి కృషి చేసిన మహానాయకుడు నాయిని నర్సింహారెడ్డి అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం లంబాడి తండా బస్తీలో మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై నాయిని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎం.ఎన్.శ్రీనివాస్ రావు, రాంరెడ్డి, చందు, నాయిని కుమారుడు నాయిని దేవేందర్‌రెడ్డి, నాయకులు రేషం మల్లేశ్, నేత శ్రీను, కల్వ గోపి, సిరిగిరి శ్యామ్, సిరిగిరి కిరణ్, కల్యాణ్ నాయక్, దేయ దేవ్, దేవేందర్, అరుణ్,రాజేశ్ పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో.. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పున్న సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతి కార్యక్రమం నిర్వహించారు. నాయిని చిత్రపటానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ కుమార్, మీడియా ఇన్‌చార్జి ప్రభాకర్, శ్రీనివాస్ గుప్తా, గడ్డమీది శ్రీనివాస్, కుమారస్వామి, శ్రీకాంత్, దినేశ్ గౌడ్, రాములు, స్వరూప పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తెచ్చేందుకు..

కవాడిగూడ, మే 12 : ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కృషి చేస్తుందని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ కమిటీ సలహాదారుడు సత్తయ్య, కోశాధికారి నారాయణ, అడిషనల్ సెక్రెటరీ శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ, యువజన కమిటీ అధ్యక్షుడు రవీందర్, మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా

శంకర్‌జీ జయంతి

ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవస్థాపకులు శంకర్‌జీ జయంతిని పురస్కరించుకుని నాంపల్లిలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు వినయ్‌ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, హనుమంతరావుతో పాటు సొసైటీ, ఎకనామిక్ కమిటీ, ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ సభ్యులు ఆయన సేవలను కొనియాడారు. – అబిడ్స్

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం ప్రజాస్వామ్యానికి విఘాతం

కాచిగూడ,మే 12 : బీజేపీ నాయకులు బహిరంగ సభలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్యానికి విఘాత మని జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. ఆదివారం కాచిగూడలో మాట్లాడుతూ.. అన్నివర్గాల వారి హక్కులను కాపాడాల్సిన ప్రధాని , కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తరుచుగా ముస్లిం రిజర్వేషన్ల రద్దు అంశంపై మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విఘాతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందగోపాల్, ఉదయ్, చౌటుప్పల్ సురేశ్ పాల్గొన్నారు.

వేణునాదం.. చిత్ర గానం

వేణుగాన సంగీత కచేరిని నిర్వహిస్తున్న తల్లూరి నాగరాజు, లలిత్

రవీంద్రభారతి, మే 12 : సుధాకర గండి ఫౌండేషన్, నందప్రభ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో కళారత్న, వేణు గాన విశారద సంగీత విశ్వభూషణ తల్లూరి నాగరాజు, తల్లూరి లలిత్ వేణు నాదం – చిత్ర గానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పారిశ్రామికవేత్త సుధాకర్‌గండి, జి.ఎస్.పి. వీరారెడ్డి, బి. అశ్విని సుబ్బారావు విచ్చేశారు. తల్లూరి నాగరాజు, తల్లూరి లలిత్ కచేరిని అభినందనందించారు. సుధాకర గండి, వీరారెడ్డి, అశ్విని సుబ్బారావును సన్మానించారు.

ఓటు వినియోగించుకున్న యువతకు కరాటే శిక్షణ

కాచిగూడ, మే 12 : ఎన్నికల సందర్భంగా యువత ఓటు వేసి నెల రోజుల పాటు ఉచిత కరాటే శిక్షణను పొందవచ్చని జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు జీఎస్ గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాసామ్యం పటిష్టంగా ఉండలాంటే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఈ నెల 15 నుంచి జూన్ 15 వరకు ఉచిత కరాటే శిక్షణను పొందవచ్చని తెలిపారు. వివరాలకు 9505800047లో సంప్రదించవచ్చని కోరారు.